Follow: @ANNTELUGU
ANN తెలుగు
REGISTERED NUMBER APTEL/2014/58382
04-05-2026
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 127 పేజీలు-04 వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD సోమవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇరాన్‌కు ట్రంప్ షాక్

### అమెరికాకు 14 సూత్రాల శాంతి ప్రణాళిక
### ఇరాన్ ప్రతిపాదన సరిగాలేదన్న ట్రంప్

**మహా:** అమెరికా ఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు ఇప్పట్లో తొలగేలా కనిపించడం లేదు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ ప్రభుత్వం తాజాగా 14 సూత్రాల శాంతి ప్రతిపాదనను అమెరికాకు పంపిది. అయితే దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించకపోవడం గమనార్హం. కేవలం కాల్పుల విరమణ మాత్రమే కాకుండా యుద్ధానికి శాశ్వత ముగింపు పలకాలని ఇరాన్ డిమాండ్ చేస్తుండగా.. ట్రంప్ మాత్రం ఇరాన్ కోరుతున్న కొన్ని అంశాలకు తాను అంగీకరించబోనని తేల్చి చెప్పారు.

**ఇరాన్ డిమాండ్లు ఇవే..**

ఇరాన్ పంపిన 14 పాయింట్ల ప్రణాళికలో ప్రధానంగా తమ దేశంపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తి వేయాలని, నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని కోరింది. అలాగే ఇరాన్ సరిహద్దుల సమీపంలో ఉన్న అమెరికా దళాలను ఉపసంహరించుకోవాలని,

మిగతా 2లో

**టాప్ న్యూస్**

**పినరయి విజయన్**
- ఓటమిని ముందే అంగీకరించారా?
- సోషల్ మీడియా ఖాతాలో మార్పులు
- సీఎం హోదా తొలగింపు



02

**నేడు తెలంగాణ క్యాబినెట్ భేటీ**
- ఉద్యోగుల సమస్యలు, తుమ్మిడిహట్టిపై నిర్ణయాలు



02

**సీఎంగా నందమూరి బాలకృష్ణ**
- ఫ్యాన్స్ కు పూనకాలే



02



# ఐదు రాష్ట్రాలు..
# హైటెన్షన్

## బెంగాల్ క్లైమాక్స్‌పై ఉత్కంఠ

### తమిళనాడులో రిసార్ట్ పాలిటిక్స్

అస్సాంలో కాంగ్రెస్ అలర్ట్.. కేరళలో కాంగ్రెస్ సంబురాలకు రెడీ
దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్న ఫలితాలు
ఎన్నికల ఫలితాల చుట్టూ వందలకోట్ల బెట్టింగ్ లు

(మహా నెట్ వర్క్ )

టెన్షన్.. టెన్షన్. దేశ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూపే ఐదురాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బెంగాల్ టైగర్ దీదీ మమతాబెనర్జీ నాలుగోసారి అధికారపగ్గాలు చేపడుతుందా? బెంగాల్ గడ్డను చరిత్రలో మొదటిసారి కమలం కైవసం చేసుకుంటుందా? తమిళనాడు గడ్డపై స్టాలిన్ విజయ ఢంకా మోగిస్తాడా? విజయ్ హిస్టరీ క్రియేట్ చేస్తాడా? కేరళలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందా? అస్సాం పుదుచ్చేరి లో ఫలితం కమలమేనా? అంచనాలు అనూహ్యంగా మారిపోతాయా? మధ్యాహ్నం కల్లా ఫలితాలు తేలిపోనున్నాయి. విజయుడెవరో.. ఇంటికి వెళ్ళేదెవరో.. సీటును కాపాడుకునేదెవరో తేలిపోతుంది.

### బెంగాల్‌లో హైవోల్టేజ్ క్లైమాక్స్

ప్రస్తుత 2026 అసెంబ్లీ ఎన్నికలు ఒక సరికొత్త హై-వోల్టేజ్ పోరుకు తెరలేపాయి. 15 ఏళ్లుగా ఎదురులేని శక్తిగా కొనసాగిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఇప్పుడు దూకుడు మీదున్న భారతీయ జనతా పార్టీ రూపంలో అత్యంత క్లిష్టమైన సవాలు ఎదురవుతోంది. 'బెంగాల్‌లో టీఎంసీకి సూర్యాస్తమయం ఖాయం' అన్న బీజేపీ హైకమాండ్ .. ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా అక్కడే మకాం వేసి సర్వశక్తులూ ఒడ్డారు. ప్రస్తుత 2026 ఎన్నికలు టీఎంసీ, బీజేపీ మధ్య ముఖాముఖీ సమరంగా మారాయి. మునుపెన్నడూ లేనివిధంగా భారీ పోలింగ్ నమోదు కావడం ఉత్కంఠ రేపుతోంది. భవానీపూర్ లాంటి టీఎంసీ కంచుకోటల్లో సైతం బీజేపీ బలమైన అభ్యర్థులను బరిలోకి దింపింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు సైతం బీజేపీకి మొగ్గు చూపుతుండటం దీదీకి కలవరపెట్టే అంశమే. 2021లో నందిగ్రామ్‌లో సువేందు అధికారి చేతిలో ఓటమి పాలైన మమత, ఈసారి మరింత కఠినమైన పోరును ఎదుర్కొంటున్నారు. పైకి 200కు పైగా సాధిస్తామని ఎబుతున్నా పోరు ఉత్కంఠగా ఉంది. దశాబ్దాలుగా ఒకే పార్టీని సుదీర్ఘకాలం ఆదరించిన బెంగాల్ ప్రజలు.. ఈసారి మార్పు కోరుకుంటూ కొత్త చరిత్ర లిఖిస్తారా లేక దీదీకే మళ్లీ జై కొడతారా అనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.




## కరీంనగర్‌లో పట్టపగలే కాల్పుల కలకలం

పీఎంజే జ్యువెలర్స్‌లో సాయుధ దుండగుల బీభత్సం
కస్టమర్ల ముసుగులో కరుడుగట్టిన దొంగలు
షోరూంలో విచక్షణారహితంగా కాల్పులు
మంత్రి బండి సంజయ్ ఇంటి సమీపంలోనే దోపిడీ
నలుగురికి తీవ్రగాయాలు

**కరీంనగర్, మహా:**
ప్రశాంతతకు మారుపేరైన కరీంనగర్ నగరంలో పట్టపగలే తుపాకుల శబ్దం గుండెజల్లుమనిపించింది. నగర నడిబొడ్డున ఉన్న ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ సాయుధ దోపిడీ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అచ్చం సినీ ఫక్కీలో వినియోగదారుల ముసుగులో చొరబడిన సాయుధ ముఠా.. ఆభరణాలను దోచుకునే క్రమంలో సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసానికి, జిల్లా జడ్జి క్వార్టర్స్‌కు అత్యంత సమీపంలో, అది కూడా మంత్రి పర్యటన ముగిసిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఈ దారుణం జరగడం స్థానికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. ఈ ఘటనతో నగరంలోని వ్యాపార వర్గాలు, సాధారణ ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు.

**క్షణాల్లోనే మారణాయుధాలతో బెదిరింపు**

అలా ఒకరి తర్వాత ఒకరుగా ఐదుగురు లోపలికి ప్రవేశించిన తర్వాత వారి అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. లోపల ఉన్న దుండగులు హిందీ, తెలుగు భాషల్లో మాట్లాడుకుంటూ ఒక్కసారిగా తమ వెంట తెచ్చుకున్న తుపాకులను బయటకు తీశారు. సిబ్బందిని తుపాకులతో బెదిరించి, ప్రతిఘటిస్తే ప్రాణాలు తీస్తామని హెచ్చరిస్తూ అందినకాడికి ఆభరణాలను దోచుకునే ప్రయత్నం చేశారు.

మిగతా 2లో

## కేరళ హోరాహోరీ

### సంబురాలకు కాంగ్రెస్ రెడీ

**తిరువనంతపురం:** కేరళ రాజకీయ ముఖచిత్రం కాసేపట్లో తేలిపోనుంది. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్, ఎన్డీఏ మధ్య జరిగిన ఉత్కంఠభరిత అసెంబ్లీ ఎన్నికల సమరానికి మే 4న తెరపడనుంది. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండటంతో కేరళ ప్రజలతో పాటు యావత్ దేశం ఈ ఫలితాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ ఫలితాలు మూడు ప్రధాన పార్టీలకు అత్యంత కీలకం. 2016 నుంచి ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, వరుసగా మూడోసారి విజయం సాధించి చరిత్ర సృష్టించాలని అధికార ఎల్‌డీఎఫ్ భావిస్తోంది. ఇక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ తన ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకోవాలని చూస్తోంది. ఎగ్జిట్ పోల్స్ మాత్రం అత్యంత హోరాహోరీ పోరు తప్పదని, యూడీఎఫ్‌కు స్వల్ప ఆధిక్యం రావచ్చని అంచనా వేస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో కాంగ్రెస్ పార్టీ సంబురాలకు సన్నాహాలు చేసుకోగా, కొచ్చిలో బిజెపి కూడా ప్రత్యేక స్వీట్లు రెడీ చేయిస్తోంది.

## తమిళనాడు.. అంచనా రొంబ కష్టం

**చెన్నై:** తమిళనాడును అంచనా వేయడం ఎప్పుడూ సులభం కాదు. 2026 అసెంబ్లీ ఎన్నికలు అంచనాలను మరింత కష్టతరం చేశాయి. ఏప్రిల్ 23న ఇప్పటికే పోలింగ్ జరగగా, మే 4న ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉంది. ప్రతి వర్గం నుంచి ధీమా ఉన్నప్పటికీ, ఫలితం తమ వశమైందని ఎవరూ ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉంది. దీనికి కారణం చాలా స్పష్టం. సాంప్రదాయకంగా డీఎంకే, ఏఐఏడీఎంకేల మధ్య జరిగే హోరాహోరీ పోరు ఈసారి చతుర్ముఖ పోటీగా మారింది. నటుడు విజయ్ యొక్క 'తమిళగా వెట్రి కజగం', సీమన్ యొక్క 'నామ్ తమిళర్ కచ్చి' రెండూ కూడా రాజకీయ రంగంలో తమకు గణనీయమైన వాటా ఉందని వాదిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 సీట్లు ఉన్నాయి. అధికారం చేపట్టాలంటే ఏ పార్టీ లేదా కూటమికి అవసరమైన మ్యాజిక్ మార్కు సీట్లు 118. ఈ లెక్కన డీఎంకే కూటమి గతంతో పోలిస్తే సీట్ల సాధనలో వెనుకబడినా అధికారం చేపట్టడం ఖాయమన్న అంచనా మెజారిటీ సర్వేలు చెబుతున్నాయి. ఎన్నో ఆశలతో కొత్త పార్టీ పెట్టిన విజయ్ కు తొలిసారి ఎన్నికల్లో ఊహించిన దానికంటే మంచి ప్రతిభ చాటారని, కింగ్ మేకర్ లేదా కింగ్ కావడం ఖాయమని మరికొన్ని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అదే జరిగితే జయలలిత పార్టీ భవిష్యత్తు అగమ్యగోచరమవుతుంది.

## అమ్మ దీవెనే ప్రాణవాయువు

- డీజీపీ సీవీ ఆనంద్ భావోద్వేగం
- మృత్యువును జయించిన మాతృమూర్తి సంకల్పం
- ఉన్నత పదవిలో చూసి మురిసిపోయిన తల్లి

02



## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- ఏసీ పేలి 9 మంది సజీవ దహనం
- వివేక్ విహార్‌లో పెను విషాదం

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర విషాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని షాహదరా, వివేక్ విహార్ ప్రాంతంలో ఉన్న ఓ నాలుగు అంతస్తుల నివాస సముదాయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున సంభవించిన ఈ దుర్ఘటనలో ఒక ఏడాదిన్నర పసివాడితో సహా మొత్తం తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. ఏసీ (ఎయిర్ కండిషనర్) పేలడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

మిగతా 2లో



## యాదాద్రిలో భక్తజన సంద్రం

### నారసింహుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**యాదాద్రి, మహా:** యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం ఆదివారం నాడు భక్తులతో కిక్కిరిసిపోయింది. సెలవు దినం కావడంతో పాటు వేసవి విరామం తోడవడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తజనం భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన స్వామివారి కొలువు.. రాత్రి పవళింపు సేవ వరకు భక్తుల రాకతో సందడిగా మారింది. ఉదయం నుంచే కొండపైన ఉన్న క్యూ కాంప్లెక్సులు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ధర్మదర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటకు పైగా నిరీక్షించాల్సి వస్తోంది.

మిగతా 2లో



# ఐదు రాష్ట్రాలు.. హైటెన్షన్



(మొదటిపేజీ తరువాయి)

క్షణాల వ్యవధిలోనే ప్రశాంతంగా ఉన్న షోరూం వాతావరణం భయానకంగా మారిపోయింది.

**పక్కా పథకం..**
**వినియోగదారుల ముసుగులో ఎంట్రీ**

ఈ భారీ దోపిడీ కోసం దుండగులు ముందుగానే పక్కా రెక్కీ నిర్వహించినట్లు స్పష్టమవుతోంది. ఉదయం షోరూం తెరిచిన కాసేపటికే ఐదుగురు సభ్యుల ముఠా అత్యంత వ్యూహాత్మకంగా లోపలికి ప్రవేశించింది. ముందుగా ఒక దుండగుడు లోపలికి వచ్చి 20 గ్రాముల బంగారు చైన్ కావాలని, మోడల్స్ చూపించాలని సిబ్బందిని కోరాడు. అతనికి ఆభరణాలు చూపిస్తున్న సమయంలోనే మరో ఇద్దరు లోపలికి వచ్చి తాము కూడా బంగారం కొనుగోలు చేస్తామని నమ్మించారు. ఆ వెంటనే మిగిలిన ఇద్దరు కూడా వినియోగదారుల్లాగే షోరూంలోకి అడుగుపెట్టారు.

**ప్రాణాలకు తెగించి**
**పోరాడిన షోరూం సిబ్బంది**

దుండగులు తుపాకులతో బెదిరించినప్పటికీ పీఎంజే జ్యువెలరీ సిబ్బంది ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. సంస్థ సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బంది అత్యంత అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినప్పటికీ, దోపిడీని అడ్డుకునేందుకు దుండగులపైకి ఎదురువెళ్లారు. దొంగలను నిలువరించే క్రమంలో సిబ్బందికి, సాయుధ ముఠాకు మధ్య తీవ్ర స్థాయిలో పెనుగులాట జరిగింది. సిబ్బంది ఊహించని ఈ ప్రతిఘటనతో దొంగలు కంగుతిన్నారు.

**విచక్షణారహితంగా కాల్పులు..**
**రక్తమోడిన ప్రాంగణం**

సిబ్బంది తమను అడ్డుకోవడంతో దుండగులు తీవ్ర ఆగ్రహానికి గురై వారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో పలువురు సిబ్బందికి తీవ్ర గాయాలై రక్తపు మడుగులో కుప్పకూలారు. సిబ్బంది పోరాటం వల్ల భయాందోళనకు గురైన దుండగులు, తాము ఆభరణాలు నింపుకోవడానికి తెచ్చుకున్న ఒక బ్యాగును ఘటనా స్థలంలోనే జారవిడిచి అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన వారిని తోటి సిబ్బంది, స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

**పది నిమిషాల ముందే మంత్రి బండి**
**సంజయ్ పర్యటన**

ఈ ఘటన జరగడానికి కేవలం పది నిమిషాల ముందే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆ ప్రాంతంలో పర్యటించడం గమనార్హం. షోరూంకు అతి సమీపంలో ఓ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అప్పటివరకు ఆ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు కూడా ఉంది. మంత్రి అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, భద్రతా వలయం తొలగిపోయిన పది నిమిషాల్లోనే దొంగలు ఇంతటి సాహసానికి పాల్పడటం పోలీసు వ్యవస్థనే నివ్వెరపోయేలా చేసింది.

**హుటాహుటిన ఘటనా**
**స్థలానికి కేంద్ర మంత్రి**

పీఎంజే షోరూంలో కాల్పుల విషయం తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తదితరులతో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపలికి వెళ్లి సీసీటీవీ ఫుటేజీని స్వయంగా పరిశీలించారు. దుండగులను అడ్డుకున్న సిబ్బంది తెగింపును ఆయన అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది అత్యంత దురదృష్టకరమైన ఘటన అని, అయినప్పటికీ పోలీసులు రంగంలోకి దిగారని, దుండగులను కచ్చితంగా పట్టుకుంటారనే పూర్తి నమ్మకం తనకు ఉందని స్పష్టం చేశారు.

**మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు**
**క్షతగాత్రులు**

కాల్పుల్లో గాయపడిన సిబ్బందికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వైద్యులు కీలక ప్రకటన చేశారు. బుల్లెట్ గాయాలైనప్పటికీ ఎవరికీ ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. అయితే, వారికి మరింత మెరుగైన, అత్యవసర చికిత్స అవసరం కావడంతో మెడికల్ టీం పర్యవేక్షణలో క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించినట్లు మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం, ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

**రంగంలోకి పోలీస్ బాస్..**
**నగరవ్యాప్తంగా జల్లెడ**

సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తన బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంను రప్పించి షోరూం అంతటా శాస్త్రీయ ఆధారాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా కోర్టు వెనకాల ఉన్న లైన్‌లో, సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, ప్లాస్టర్, తుపాకీ మ్యాగజైన్ లభ్యమైనట్లు గుర్తించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు.. కరీంనగర్ చుట్టుపక్కల ప్రాంతాలను దిగ్బంధించి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**ఏసీ పేలి 9 మంది సజీవ దహనం.. వివేక్ విహార్‌లో పెను విషాదం**

(మొదటిపేజీ తరువాయి)

గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంటలు అంటుకోవడంతో బాధితులు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది.

**అర్ధరాత్రి దాటాక ఏసీ పేలుడు**

స్థానిక పోలీసుల వివరాల ప్రకారం, వివేక్ విహార్ ఫేజ్ 1లోని భవనంలో ఆదివారం తెల్లవారుజామున 3:15 నుంచి 3:45 గంటల మధ్య అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెనుక వైపు ఉన్న ఫ్లాట్‌లో ఏసీ యూనిట్ పేలడం వల్లే ఈ మంటలు ప్రారంభమైనట్లు అధికారులు భావిస్తున్నారు. క్షణాల వ్యవధిలోనే మంటలు రెండో, మూడో మరియు నాలుగో అంతస్తులకు వేగంగా వ్యాపించాయి. ఒక్కో అంతస్తులో 4BHK ఫ్లాట్లు ఉండటం, ఫ్లాట్లలో ఉన్న గృహోపకరణాలు, ఫర్నిచర్ కారణంగా మంటల తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయి భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది.





**ఒకే కుటుంబానికి చెందిన**
**ఐదుగురు మృతి**

ఈ అగ్నిప్రమాదంలో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, వారిలో అత్యధికులు ఒకే కుటుంబానికి చెందినవారు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. రెండో అంతస్తులో నివాసం ఉంటున్న అరవింద్ జైన్ (60), ఆయన భార్య అనిత జైన్ (58), కుమారుడు నిశాంత్ (35), కోడలు ఆంచల్ (33), వారి ఏడాదిన్నర మనవడు ఆకాష్ జైన్ మంటల్లో చిక్కుకుని ప్రాణాలు వదిలారు. అలాగే, మూడో అంతస్తులో నివాసం ఉంటున్న నితిన్ జైన్ (50), ఆయన భార్య శైలీ (48), కుమారుడు సమ్యక్ (25), మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న శిఖా జైన్ (45) కూడా ఈ దుర్ఘటనలో మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రగాయాలతో బయటపడగా వారిని చికిత్స నిమిత్తం గురు తేగ్ బహదూర్ ఆసుపత్రికి తరలించారు.

**ఐదు గంటల పాటు కొనసాగిన**
**సహాయక చర్యలు**

అగ్నిప్రమాదంపై తెల్లవారుజామున 3:48 గంటలకు సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక దళం (DFS) వెంటనే అప్రమత్తమైంది. మొత్తం 14 ఫైర్ ఇంజన్లు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (DDMA) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాయి. భవనం డిజైన్ సంక్లిష్టంగా ఉండటం, లోపల దట్టమైన పొగ అలుముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సుమారు ఐదు గంటల పాటు శ్రమించిన రెస్క్యూ టీమ్, ఉదయం 8 గంటల సమయంలో మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చింది. ఫైర్ సిబ్బంది సుమారు 15 మందిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు.

**లాక్ చేయబడిన తలుపులు..**
**తప్పించుకునే దారి లేక..**

ఈ ప్రమాదంలో ప్రాణనష్టం ఎక్కువగా జరగడానికి ప్రధాన కారణం బాధితులు గాఢ నిద్రలో ఉండటమే. మంటలు అంటుకున్న విషయం గ్రహించి వారు మేల్కొనే సరికే భవనం నలువైపులా మంటలు చుట్టుముట్టాయి. ప్రధాన ద్వారాలు లాక్ చేసి ఉండటం, కిటికీలకు బలమైన గ్రిల్స్ ఉండటంతో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కూడా బయటకు రాలేకపోయారు. ఊపిరాడక, మంటల వేడికి తాళలేక అత్యంత దయనీయ స్థితిలో ప్రాణాలు వదిలారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలు అత్యంత దారుణంగా కాలిపోవడంతో కొందరిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# అమ్మ దీవెనే ప్రాణవాయువు

- డీజీపీ సీవీ ఆనంద్ భావోద్వేగం
- మృత్యువును జయించిన మాతృమూర్తి సంకల్పం
- ఉన్నత పదవిలో చూసి మురిసిపోయిన తల్లి

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్ తన మాతృమూర్తిని కలిసి ఆశీస్సులు అందుకున్న వేళ అత్యంత భావోద్వేగపూరితమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పోరాడి, మృత్యువు అంచుల దాకా వెళ్లి తిరిగి వచ్చిన తన తల్లిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా తన వృత్తిపరమైన ఎదుగుదల వెనుక ఉన్న అమ్మ దీవెనలను, ఆమె చూపిన అసాధారణ మనోధైర్యాన్ని స్మరించుకుంటూ పంచుకున్న విశేషాలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి. కొంతకాలం క్రితం సీవీ ఆనంద్ తల్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రాణాలతో బయటపడటం కష్టమని వైద్యులు భావించిన క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆమె తన అచంచలమైన సంకల్పంతో మృత్యువును జయించారు. తన కుమారుడిని అత్యున్నతమైన డీజీపీ పదవిలో చూడాలన్న ఆమె బలమైన ఆకాంక్షే ఆమెను ప్రాణాలతో నిలబెట్టిందని ఆనంద్ పేర్కొన్నారు. తల్లి మనసులోని ఆ చిన్న కోరిక ఆమెకు కొండంత బలాన్ని ఇచ్చిందని, ఆ ఆశే ఆమెను మళ్ళీ కోలుకునేలా చేసిందని ఆయన వివరించారు. తన కుమారుడు రాష్ట్ర పోలీసు శాఖకు సారథ్యం వహించడం చూసిన తర్వాతే ఆమె కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర పోలీసు బాస్‌గా బాధ్యతలు చేపట్టిన తరుణంలో, ఆ విజయాన్ని కళ్లారా చూసి మురిసిపోతున్న తల్లి పాదాలకు ఆయన నమస్కరించారు. పదవులు, హోదాల కంటే తల్లి దీవెనలే గొప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. అమ్మ కోరిక నెరవేరడం, ఆమె ఆరోగ్యంగా తన కళ్లముందే ఉండటం మించిన ఆనందం మరొకటి లేదని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా, మాతృమూర్తి ఆశీస్సులు తనను ఎల్లప్పుడూ సరైన మార్గంలో నడిపిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించాలని డిమాండ్ చేసింది. కేవలం ఇరాన్‌తోనే కాకుండా లెబనాన్ సహా అన్ని రంగాల్లో ఉన్న ఉద్రిక్తతలకు ముగింపు పలకాలన్నది టెహ్రాన్ వాదన. దీనిపై ఒక నెల రోజుల్లోనే నిర్ణయం తీసుకోవాలని ఇరాన్ పట్టుబడుతుండగా.. అమెరికా మాత్రం కనీసం రెండు నెలల పాటు కాల్పుల విరమణ కొనసాగాలని కోరుతోంది. "ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. కానీ అవి ఒక కొలిక్కి రావడం లేదు. నేను అంగీకరించలేని విషయాలను వారు కోరుతున్నారు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అలాగే 60 రోజులకు మించి సైనిక చర్యకు కాంగ్రెస్ ఆమోదం తప్పనిసరి చేసే యుద్ధ అధికారాల తీర్మానంలోని గడువును కూడా ఆయన తోసి పుచ్చారు. చట్టసభ సభ్యులకు రాసిన లేఖలో.. కాల్పుల విరమణ ఒప్పందం ఆ కాల పరిమితిని సమర్థవంతంగా నిలిపివేసిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఈ వాదనను న్యాయ నిపుణులు వ్యతిరేకిస్తున్నారు.

# కరీంనగర్‌లో పట్టపగలే కాల్పుల కలకలం





(మొదటిపేజీ తరువాయి)

ఈ భారీ దోపిడీ కోసం దుండగులు ముందుగానే పక్కా రెక్కీ నిర్వహించినట్లు స్పష్టమవుతోంది. ఉదయం షోరూం తెరిచిన కాసేపటికే ఐదుగురు సభ్యుల ముఠా అత్యంత వ్యూహాత్మకంగా లోపలికి ప్రవేశించింది. ముందుగా ఒక దుండగుడు లోపలికి వచ్చి 20 గ్రాముల బంగారు చైన్ కావాలని, మోడల్స్ చూపించాలని సిబ్బందిని కోరాడు. అతనికి ఆభరణాలు చూపిస్తున్న సమయంలోనే మరో ఇద్దరు లోపలికి వచ్చి తాము కూడా బంగారం కొనుగోలు చేస్తామని నమ్మించారు. ఆ వెంటనే మిగిలిన ఇద్దరు కూడా వినియోగదారుల్లాగే షోరూంలోకి అడుగుపెట్టారు.

**ప్రాణాలకు తెగించి**
**పోరాడిన షోరూం సిబ్బంది**

దుండగులు తుపాకులతో బెదిరించినప్పటికీ పీఎంజే జ్యువెలరీ సిబ్బంది ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. సంస్థ సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బంది అత్యంత అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినప్పటికీ, దోపిడీని అడ్డుకునేందుకు దుండగులపైకి ఎదురువెళ్లారు. దొంగలను నిలువరించే క్రమంలో సిబ్బందికి, సాయుధ ముఠాకు మధ్య తీవ్ర స్థాయిలో పెనుగులాట జరిగింది. సిబ్బంది ఊహించని ఈ ప్రతిఘటనతో దొంగలు కంగుతిన్నారు.

**విచక్షణారహితంగా కాల్పులు..**
**రక్తమోడిన ప్రాంగణం**

సిబ్బంది తమను అడ్డుకోవడంతో దుండగులు తీవ్ర ఆగ్రహానికి గురై వారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో పలువురు సిబ్బందికి తీవ్ర గాయాలై రక్తపు మడుగులో కుప్పకూలారు. సిబ్బంది పోరాటం వల్ల భయాందోళనకు గురైన దుండగులు, తాము ఆభరణాలు నింపుకోవడానికి తెచ్చుకున్న ఒక బ్యాగును ఘటనా స్థలంలోనే జారవిడిచి అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన వారిని తోటి సిబ్బంది, స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

**పది నిమిషాల ముందే మంత్రి బండి**
**సంజయ్ పర్యటన**

ఈ ఘటన జరగడానికి కేవలం పది నిమిషాల ముందే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆ ప్రాంతంలో పర్యటించడం గమనార్హం. షోరూంకు అతి సమీపంలో ఓ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అప్పటివరకు ఆ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు కూడా ఉంది. మంత్రి అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, భద్రతా వలయం తొలగిపోయిన పది నిమిషాల్లోనే దొంగలు ఇంతటి సాహసానికి పాల్పడటం పోలీసు వ్యవస్థనే నివ్వెరపోయేలా చేసింది.

**హుటాహుటిన ఘటనా**
**స్థలానికి కేంద్ర మంత్రి**

పీఎంజే షోరూంలో కాల్పుల విషయం తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తదితరులతో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపలికి వెళ్లి సీసీటీవీ ఫుటేజీని స్వయంగా పరిశీలించారు. దుండగులను అడ్డుకున్న సిబ్బంది తెగింపును ఆయన అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది అత్యంత దురదృష్టకరమైన ఘటన అని, అయినప్పటికీ పోలీసులు రంగంలోకి దిగారని, దుండగులను కచ్చితంగా పట్టుకుంటారనే పూర్తి నమ్మకం తనకు ఉందని స్పష్టం చేశారు.

**మెరుగైన వైద్యం కోసం**
**హైదరాబాద్‌కు క్షతగాత్రులు**

కాల్పుల్లో గాయపడిన సిబ్బందికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వైద్యులు కీలక ప్రకటన చేశారు. బుల్లెట్ గాయాలైనప్పటికీ ఎవరికీ ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. అయితే, వారికి మరింత మెరుగైన, అత్యవసర చికిత్స అవసరం కావడంతో మెడికల్ టీం పర్యవేక్షణలో క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించినట్లు మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం, ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

**రంగంలోకి పోలీస్ బాస్..**
**నగరవ్యాప్తంగా జల్లెడ**

సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తన బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంను రప్పించి షోరూం అంతటా శాస్త్రీయ ఆధారాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా కోర్టు వెనకాల ఉన్న లైన్‌లో, సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, ప్లాస్టర్, తుపాకీ మ్యాగజైన్ లభ్యమైనట్లు గుర్తించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు.. కరీంనగర్ చుట్టుపక్కల ప్రాంతాలను దిగ్బంధించి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీకి గురైన ఆభరణాల విలువ ఎంతుంటుందనేది పూర్తి విచారణలో తేలనుంది.

# సీఎంగా నందమూరి బాలకృష్ణ

**మహా:** నందమూరి నటసింహం బాలయ్యకి దేశవ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. తెరపై ఆయన మాస్ డైలాగ్స్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కి భారీ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు లేటెస్ట్‌గా నందమూరి అభిమానులకు పూనకాలు తెప్పించే వార్త టాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాలకృష్ణ కొరటాల శివ కాంబోలో ఎన్బీకే112 ప్రాజెక్ట్ అధికారికంగా ఖరారైన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలయ్య పోషించబోయే పాత్రపై వస్తున్న లీకులు ఇప్పుడు ఇండస్ట్రీని షేక్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన ఒక పవర్‌ఫుల్ పొలిటికల్ డ్రామాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో బాలకృష్ణ ఒక పవర్‌ఫుల్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపిస్తారని సమాచారం. 'భరత్ అనే నేను'లో మహేష్ బాబును సీఎంగా చూపించిన కొరటాల, ఇప్పుడు బాలయ్య మార్క్ మాస్ ఎలివేషన్లతో ఆ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దబోతున్నారట. అదే జరిగితే సీఎం బాలయ్య ను చూసి ఫ్యాన్స్ కు పూనకాలే.

# యాదాద్రిలో భక్తజన సంద్రం

**నారసింహుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు**



(మొదటిపేజీ తరువాయి)

స్వామివారి నిత్య కల్యాణం, సుదర్శన నారసింహ హోమం వంటి సేవలలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. కొండ కింద ఉన్న లక్ష్మీ పుష్కరిణి వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కొండపైకి చేరుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించారు. ప్రధాన ఆలయ పరిసరాల్లో ఎక్కడా తొక్కిసలాట జరగకుండా భద్రతా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద కూడా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో కౌంటర్ల సంఖ్యను పెంచి లడ్డూ ప్రసాదాన్ని నిరంతరం అందుబాటులో ఉంచారు. వాహన నిలిపివేత ప్రదేశాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఆర్టీసీ ప్రత్యేక రవాణా సౌకర్యాల ద్వారా భక్తులను కొండపైకి చేరవేసే ప్రక్రియ నిరంతరాయంగా సాగుతోంది. కొండపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడంతో యాదాద్రి గిరి నారసింహ నామస్మరణతో మారుమోగుతోంది. ఆలయ పరిసరాల్లో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలను అధికారులు మరింత పటిష్టం చేశారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ప్రక్రియను వేగవంతం చేసేందుకు అర్చకులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారు.

# పినరయి విజయన్ ఓటమిని ముందే అంగీకరించారా?

**సోషల్ మీడియా ఖాతాలో మార్పులు.. సీఎం హోదా తొలగింపు**

**మహా:** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన మార్పులు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఆయన తన అధికారిక ఖాతాల నుంచి 'ముఖ్యమంత్రి' అనే హోదాను తొలగించారు. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి దాదాపు 12 గంటల ముందు ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో 'చీఫ్ మినిస్టర్' అనే హోదా స్థానంలో 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు' అని ఆయన మార్చుకున్నారు. ఈ అనూహ్య పరిణామం కేరళ రాజకీయాల్లో ఉత్కంఠను మరింత పెంచింది. ఈ మార్పులపై సోషల్ మీడియాలో నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. "పినరయి విజయన్ ఫలితాలను ముందే పసిగట్టారా?", "ఓటమిని అంగీకరించి హోదా మార్చారా?" అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ కూటమి ఓటమి ఖాయమని తెలియడంతోనే విజయన్ ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.



# నేడు తెలంగాణ క్యాబినెట్ భేటీ

**ఉద్యోగుల సమస్యలు, తుమ్మిడిహట్టిపై నిర్ణయాలు**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం సోమవారం జరగనున్నది. సచివాలయంలో జరిగే ఈ భేటీలో ఉద్యోగులకు బంధించిన కీలకమైన అంశాలతో పాటు వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై లోతుగా చర్చ జరగనుంది. ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రభుత్వం విడుదల చేయనున్న వన్ టైమ్ ఇన్‌స్టాల్‌మెంట్, పెండింగ్ బిల్లుల బకాయిల పేమెంట్, ఆరోగ్య భద్రత కార్డుల జారీ తదితర ముఖ్యమైన అంశాలపై విధాన నిర్ణయం జరగనున్నది. దీనికి తోడు ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టడంపై ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించగా, దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

# నూతన గృహ నిర్మాణానికి శుభారంభం

### భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో నూతన గృహ నిర్మాణానికి శుభారంభంగా నిర్వహించిన భూమి పూజా కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి కొత్త ఇంటి నిర్మాణానికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కొత్త ఇంటి నిర్మాణం ప్రతి కుటుంబానికి శుభసూచకమని, ఆనందం, ఐశ్వర్యం, శాంతి, సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తవ్వాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల అభివృద్ధి పనులకు

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయితీ మరియు ముసలిమడుగు గ్రామపంచాయితీ పరిధిలోని ముసలిమడుగు గ్రామం, సందేళ్ల రామాపురం, చెరువు సింగారం గ్రామాల్లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు మరియు గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం చుట్టారు.గ్రామాల అభివృద్ధి దిశగా చేపడుతున్న ఈ రహదారి పనులు పూర్తయిన అనంతరం గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అవసరమైన రహదారులు, మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

### రెండు లారీలు, జేసీబీ పట్టివేత



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ అధికారులు మరియు బూర్గంపాడు పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించి రెండు లారీలు, ఒక జేసీబీని పట్టుకున్నారు.మండల కేంద్రంలోని కిన్నెరసాని ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక లారీతో పాటు జేసీబీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి సంబంధిత పత్రాలను పరిశీలించారు.అలాగే అశ్వాపురం మండలం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మరో లారీని మొరంపల్లి బంజర గ్రామ పరిధిలో పట్టుకున్నారు. అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న వెంటనే అధికారులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు.పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని అధికారులు హెచ్చరించారు.

## భద్రాచలం సి.ఎస్.ఐ చర్చిలో ఘన సన్మాన కార్యక్రమం

### సర్పంచ్ పూణెం కృష్ణ, నాయకుడు రవికుమార్‌కు విశిష్ట గౌరవం



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలోని సి.ఎస్.ఐ చర్చిలో ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చర్చి పెద్దల ఆహ్వానం మేరకు సర్పంచ్ పూణెం కృష్ణ మరియు నాయకుడు చింత్రియాల రవికుమార్లను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా చర్చి పెద్దలు మాట్లాడుతూ, ప్రజాసేవలో వారి కృషి ప్రశంసనీయమని కొనియాడారు. సమాజ అభివృద్ధికి వారు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సన్మానితులు మాట్లాడుతూ, తమపై చూపిన గౌరవానికి చర్చి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, యువ నాయకులు, సి.ఎస్.ఐ చర్చి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మానితులను అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

### నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా

# ఐక్యంగా ఉద్యమించాలి

- మేడే అమరుల స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలి
- సిఐటియు రాష్ట్ర నేత మంద నరసింహారావు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలనిమేడే అమరుల స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర నేత మంద నరసింహారావు పిలుపునిచ్చారు. సిఐటియు కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక ఉత్సవ్ మేడే వారోత్సవాల నిర్వహణలో భాగంగా ఆదివారం హనుమాన్ బస్తి సెంటర్ నందు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సభకు సిఐటియు పట్టణ కార్యదర్శి భూక్య రమేష్ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్భంగా మందా నరసింహారావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్ లను బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే విధంగా కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పద్ధతికి వ్యతిరేకంగా కార్మికులు ప్రజలు కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో మేడే అమరవీరుల త్యాగాల ఫలితంగా వచ్చిన 28 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నూతనంగా కార్మికులకు వ్యతిరేకంగా హక్కులను భక్షించే పద్ధతిలో బిజెపి మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులపై పెను భారాన్ని మోపుతూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత కార్మిక వర్గంపై పెత్తనం చెలాయించాలని కార్మికుల శ్రమను దోచుకొని పెట్టుబడిదారులకు బడా యాజమాన్యాలకు ఊడిగం చేస్తూ అధికార దాహంతో తను ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కార్మికులు కష్టించి పనిచేసే భారత దేశ ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక వ్యతిరేక విధానాలపై చైతన్యవంతమైన ఉద్యమాలు నిర్మించాలని సిఐటియు పిలుపునిస్తుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటం చేస్తున్నప్పుడు ప్రజలు వెన్నంటే ఉండి కార్మికులకు అండగా నిలబడాలని వారి పోరాటాలకు సంపూర్ణ మద్దతు తెలియజేసి కార్మికులు కర్షకులు ఐక్యంగా బిజెపి చేస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను మతోన్మాద విధానాలను అర్థం చేసుకొని చైతన్యవంతంగా ముందుకు అడుగులు వేయాలని కార్మిక వర్గాన్ని రక్షించి భారతదేశాన్ని కాపాడాలని కార్మికులకు ప్రజలకు పిలుపునిచ్చారు. వాడవాడల మేడే అమరవీరుల త్యాగాలను వారి ఔన్నత్యాన్ని ప్రస్తుత మార్గదర్శకాన్ని వివరించడానికి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను కర్షకులను చైతన్యం చేస్తూ కార్మిక ఉత్సవ్ పేరుతో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నివాస ప్రాంతాల వద్ద జరుగుతున్న కార్మిక ఉత్సవము మే ఒకటి నుండి ఏడవ తారీఖు వరకు నిర్వహిస్తున్నట్లు ఈ వారోత్సవాలలో కార్మికులు కుటుంబాలతో సహా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, నందిపాటి రమేష్, సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం బ్రాంచ్ నాయకులు గూగులోత్ సక్రాం, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.రాజారావు, ఎమ్మెస్ ప్రకాష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, సిఐటియు నాయకులు ఎన్ ఎస్ రాజు, గిరి ప్రసాద్, విజయ్ మోహన్, ప్రజానాట్యమండలి కళాకారులు రాములు, రఘు, నరసింహారావు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం

### ఆకట్టుకున్న ప్రణవి శ్రీ నృత్య ప్రదర్శన .. హిందూ ధర్మాన్ని మేల్కొల్పిన శివనాగరాజ స్వామీజీ .. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తిప్పర్తి శివమూర్తి





**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతం అయింది. ఈ కార్యక్రమంలో భాగంగా హిందూ బంధువులు అంతా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఆర్కే ఫంక్షన్ హాల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సభ ప్రారంభంలో ప్రణవి శ్రీ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. అనంతరం హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శివ నాగరాజ స్వామీజీ పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మార్పు అనేది మన ఇంటి నుండే మొదలవ్వాలని సూచించారు. మన పిల్లలకు కట్టు, బొట్టు, మానవతా విలువలను, మనమే నేర్పించాలని, అన్యాయాన్ని, అధర్మాన్ని ప్రశ్నించే తత్వాన్ని బోధించాలని అన్నారు. ఇతర మతస్తుల ప్రలోభాలకు లొంగకూడదని, గోమాతను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నివారణ యజ్ఞం స్థాపికుడు తిప్పర్తి శివమూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన ప్లాస్టిక్ వాడకం వలన మానవాళికి కలిగే అనారోగ్య సమస్యలు, పర్యావరణానికి కలిగే నష్టం గురించి కార్యక్రమంలో వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఆద్యాంతం సభా ప్రాంగణమంతా జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాళ్ళూరి వెంకటేశ్వరరావు, సోడే శ్రీరాములు, చేపూరి రామచంద్రరావు, లట్టి జగన్మోహన్, జ్యోతిర్మయి, రామిశెట్టి నాగేశ్వరరావు, చొప్పకట్ల చంద్రశేఖర్ శర్మతోపాటు, హిందూ బంధువులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటీపీలు లేకుండానే హెచ్‌పి గ్యాస్ పంపిణీ..

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని..
- టీబీజీకేఎస్ డిమాండ్..



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు సరఫరా అవుతున్న హెచ్‌పి గ్యాస్ సిలిండర్లను ఓటీపీలు లేకుండానే ఇష్టానుసారంగా పంపిణీ చేసిన వారిపై తక్షణమే దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సేల్స్ ఆఫీసర్ పవన్‌ను టిబిజికెఎస్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం చరవాణి ద్వారా ఆయనకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెనీ కోఆపరేటివ్ ఏజెన్సీ ద్వారా మణుగూరు ఏరియాకు వచ్చే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లలో సుమారు 500కు పైగా హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు ఓటీపీ నంబర్లు లేకుండానే పక్కదారి పట్టినట్లు ఆరోపించారు. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గత కొన్ని రోజులుగా గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఏరియాలో తీవ్ర కొరత ఏర్పడిందన్నారు. ఇటీవల తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం సూపర్‌బజార్ డివిజనల్ మేనేజర్ కె దేవదాస్‌కు వినతిపత్రం అందించిన తర్వాత కొంతవరకు సరఫరా మెరుగుపడిందన్నారు. అయితే గ్యాస్ గోదాం వద్ద పనిచేస్తున్న కొందరు నిర్వాహకులు రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి రిజిస్ట్రేషన్ ఓటీపీలు లేకుండానే గ్యాస్ పంపిణీ చేయడంతో మళ్లీ సంక్షోభం తలెత్తిందని ఆరోపించారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులు ఓటీపీలు వచ్చినా సిలిండర్ల కోసం గోదాం వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, రాత్రి షిఫ్టులు పూర్తి చేసుకుని వచ్చిన కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో 21 రోజుల్లో గ్యాస్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం 45 రోజుల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడటమే కాకుండా సబ్సిడీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పాత విధానంలోనే గ్యాస్ బుకింగ్, సరఫరా కొనసాగించాలని, గ్యాస్ కొరత పూర్తిగా తొలగే వరకు సింగరేణి రెగ్యులర్ కార్మికుడిని గ్యాస్ కేంద్రం వద్ద నియమించాలని కోరారు. ఈ ఫిర్యాదుపై సేల్స్ ఆఫీసర్ పవన్ సానుకూలంగా స్పందించి సోమ, మంగళవారాల్లో మణుగూరు ఏరియాలో పర్యటించి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు.

## భద్రాచలం డీఎస్పీగా మాచర్ల అరుణ్ కుమార్

**భద్రాచలం మహా :** దాదాపు 10 సంవత్సరాల క్రితం ములకలపల్లి మండల ప్రజలకు ఎస్సైగా సేవలందించి ప్రజల మన్ననలు పొందిన మాచర్ల అరుణ్ కుమార్ ప్రస్తుతం భద్రాచలం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సైగా పనిచేసిన కాలంలో ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని, స్నేహపూర్వకంగా స్పందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన అరుణ్ కుమార్ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.ఇప్పుడు అదే సేవాభావంతో భద్రాచలం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టడం స్థానికులకు ఆనందాన్ని కలిగించింది. ఆయన మరింత ఉన్నత స్థాయిలో ప్రజాసేవ చేయాలని, పోలీస్ శాఖలో ఆదర్శ అధికారిగా నిలవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## మేడే సందర్భంగా కార్మిక నాయకులను

## సన్మానించిన రివర్ సైడ్ రోటరీ క్లబ్ నాయకులు




**బూర్గంపహాడ్ మహా :**"మే డే"... ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ నాయకులు ఐటిసి పిఎస్పీడీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాయకత్వం వహిస్తున్న కార్మిక నాయకులను ఘనంగా సన్మానించారు.ఎవరి సంపాదన, ఎవరి కుటుంబం వారిది అంటూ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో నిండినటువంటి ప్రస్తుత సమాజంలో, తోటి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారి హక్కులను కాపాడేందుకు తమ సమయాన్ని వెచ్చించి కా కాంట్రాక్టు కార్మికుల తరఫున పోరాడుతున్న కాంట్రాక్టు కార్మిక నాయకులైన జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పాటీ సోమిరెడ్డిని, జేఏసీ జాయింట్ కన్వీనర్లు అయిన సానికొమ్ము రామచంద్రారెడ్డి, సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్య, ఎస్కే పాషా తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల మాజీ రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ మరియు ప్రస్తుత రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ అధ్యక్షులు డాక్టరేట్ భూశిరెడ్డి శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ, నాయకత్వం అనేది కత్తి మీద సాము వంటిదని డాక్టరేట్ డా బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. సందర్భాన్ని బట్టి స్పందించాలని, తాము పనిచేసే కంపెనీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కార్మికుల ఇబ్బందులను హక్కులను కంపెనీ దృష్టికి తీసుకువెళ్లి, యాజమాన్యాన్ని ఒప్పించి తమను నమ్మిన కార్మికులను మెప్పించే విధంగా సామరస్య వివాద రహిత ఒప్పందాలను చేసుకోవాలని ఈ సందర్భంగా డాక్టరేట్ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా నాయకులు డాక్టర్ మడిపెద్ది రమేష్, రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ కాబోయే అధ్యక్షులు రొటేరియన్ ధనకొండ రాఘవయ్య భవిష్యత్తు రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ అధ్యక్షులు బాచినేని రామకృష్ణ రోటరీ సభ్యులు రవికుమార్ తదితరులతో పాటు మాజీ మండల కాంగ్రెసు అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మరియు అనేకమంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు

### జాతీయ వేదికపై సారపాక కీర్తిపతాకం

## ఒలంపియాడ్‌లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రభంజనం




**బూర్గంపహాడ్ మహా :** సారపాక నుంచి జాతీయ వేదిక దాకా... బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు.ప్రతిష్ఠాత్మక ఫేజ్ 2 మ్యాథ్స్ & సైన్స్ ఒలంపియాడ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన మన బ్రిలియంట్ చిన్నారులు స్టేట్ & డిస్ట్రిక్ట్ టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్నారు.ఈ విజయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తూ, ఈరోజు హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళా వేదిక అతిథుల చప్పట్లతో మార్మోగింది. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (SRF) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో *భారత మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు అమృత హస్తాల మీదుగా మన విద్యార్థులు అవార్డులు అందుకున్నారు.ఈ చారిత్రాత్మక క్షణంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి ధనసరి అనసూయ "సీతక్క", శ్రీమతి కొండా సురేఖ, NIT రాయ్‌పూర్ డైరెక్టర్ డా. ఎన్.వి. రమణారావు వంటి మహనీయులు విద్యార్థులకు బహుమతుల ను ప్రధానం చేసారు.

**చైర్మన్ డా. బి.ఎన్.ఆర్ గారు మాట్లాడుతూ**

"ఇది కేవలం అవార్డు కాదు... మన పిల్లల భవిష్యత్తుకు పునాది. ఒలంపియాడ్ వంటి పోటీలు పిల్లల్లో విశ్లేషణా శక్తిని, సమస్యా పరిష్కార నైపుణ్యాన్ని మేల్కొలుపుతాయి. ఈరోజు ఒలంపియాడ్ గెలిచిన వారే ... రేపు IIT, NIT IAS, IPS వంటి కంపిటీటివ్ పరీక్షల్లో గెలవగలరు అన్నారు * క్రమశిక్షణ, పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం ఉంటే అసాధ్యమంటూ ఏదీ లేదు" అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ విజయం వెనుక నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మన పిల్లలు రేపటి రోజున రాష్ట్రం, దేశం గర్వించే స్థాయికి చేరాలనేదే బ్రిలియంట్ సంకల్పం" అని పేర్కొన్నారు.ఇదే బ్రిలియంట్ విద్యా సంస్థల నుండి డాక్టర్స్, ఇజినీర్స్, డీఎస్పీ, ఎస్ ఐ ల వంటి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దామని చెప్పడం మాకెంతో గర్వం గా ఉందని బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేత గురుబ్రహ్మ అవార్డు గ్రహీత డా. బి ఎన్ ఆర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శ్రీ అభయాంజనేయ ఆలయానికి పంచలోహ విగ్రహాల బహుకరణ

రూ.1,07,116 విలువ చేసే పంచలోహ విగ్రహాలను బహూకరించిన గుగులోతు రవి(బెల్ రవి) దంపతులు



**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిధిలోని వెంకట్యతండా గ్రామంలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి, భల్లునగర్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ రవి దంపతులు రూ.1,07,116 రూపాయలు విలువ చేసే సీతారామ,లక్ష్మణ,ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలను వితరణగా అందజేశారు.దైవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థులు మూడు రోజుల నుండి ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంచలోహాల విగ్రహాల దాత గుగులోత్ రవి (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మేనేజర్) దంపతులు స్వామివారి కల్యాణం,ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పగా ఘనంగా నిర్వహించిన దైవ కార్యక్రమంలో భాగస్వాములు అయినందుకు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు.అనంతరం మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్ మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన దైవ కార్యక్రమాల ద్వారా వెంకట్యతండా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో,పాడిపంటలతో వర్ధిల్లాలని శ్రీఅభయాంజనేయస్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.దాతల సహకారంతో పాటు,గ్రామస్తుల సహకారం,యువత భాగస్వామ్యం ద్వారా ఈ దైవ కార్యక్రమం గొప్పగా నిర్వహించడం జరిగిందన్నారు .ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ బుల్లి, మంగళం కంపెనీ ఎండీ గుగులోతు రాజేందర్,మాజీ సర్పంచులు,వెంకట్యతండా గ్రామస్తులు,ఉద్యోగస్తులు ,యువత తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో అకాలవర్షం

- ధాన్యం కొనుగోలుకేంద్రంలో తడిసి ముద్దైన మొక్కజొన్న ధాన్యం
- దిక్కుతోచక విలపిస్తున్న రైతన్నలు
- పలుచోట్ల నేలకు ఒరిగిన వృక్షాలు



**నెలకొండపల్లి, మహా:** మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుముల మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దాంతో మండలంలో రైతులు కల్లాలలో ఆరబోసుకున్న మిర్చి తడిసి ముద్దయి వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. ముఠాపురం కొనుగోలు కేంద్రం వద్ద మొక్కజొన్న తడిసి ముద్దయింది. దీంతోభారీ నష్టం వాటిల్లిన రైతులు దిక్కుతోచక బోరుమంటున్నారు. మంగాపురం గ్రామంలో రోడ్లపై చెట్లు విరిగిపడటంతో వెంటనే స్పందించి సర్పంచ్ అశోకా రాణి జెసిపి సాయంతో చెట్లను తొలగించారు. చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి, అంతా క్లియర్ చేయించారు. మండలంలో పలు గ్రామాలలో రహదారుల వెంట ఈదురుగాలికి అక్కడక్కడ భారీ వృక్షాలు నేల కొరిగాయి. పలు గ్రామాల సర్పంచులు తమ పంచాయతీ పరిధిలో నేలకొరిగిన వృక్షాలను రోడ్డుపై నుండి తొలగించి, దారులను క్లియర్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తొలగిపోయింది. మండలంలో పలుచోట్ల స్తంభాలు నేలకొరిగి తీగలు తెగడంతో, మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా కోసం లైన్ల వెంబడి మరమ్మతులు చేపట్టారు. ఏది ఏమైనా ఈ అకాల వర్షం అన్నదాతలకు భారీ నష్టం చేకూర్చడంతో, రైతుల కళ్ళలో కన్నీరే మిగిలింది. చేతికి అంది వచ్చిన పంట నీటిపాలు కావడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

# బీఆర్ఎస్‌కు షాక్..

### ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లోకి సర్పంచ్ సహా పలువురు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆళ్లపల్లి మండలం దొంగతోగు గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ బచ్చల పాపారావు, నాయకుడు కొమరం రమేష్ తదితరులు ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చేరికైన నాయకులు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని పనిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పడిగ సమ్మయ్య మాజీ ఎంపీపీ, మోకాళ్ల చంద్రశేఖర్ (రామంజగూడెం సర్పంచ్), సుతారి కృష్ణ, మర్కోడు గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఐపీఎల్ సీజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు

# దూరంగా ఉండండి..

- మణుగూరు డీఎస్పీ, సిఐల హెచ్చరక..
- యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల విజ్ఞప్తి..

**మణుగూరు, మహా :** ఐపీఎల్ క్రికెట్ సీజన్ సందర్భంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, బుక్కీల మోసాలకు యువత, ప్రజలు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని మణుగూరు సబ్ డివిజన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ పాటి నాగబాబు, అశ్వాపురం, పిన్నపాక మండలాల సీఐలు సంయుక్తంగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో వివిధ ఆన్‌లైన్ యాప్స్, సోషల్ మీడియా వేదికల ద్వారా బెట్టింగ్‌కు ప్రలోభపెడుతూ బుక్కీలు అమాయకులను మోసం చేస్తున్నారన్నారు. ప్రారంభంలో చిన్న మొత్తాలు గెలిపించి, అనంతరం పెద్ద మొత్తాల్లో డబ్బులు కోల్పోయేలా చేస్తున్నారని తెలివిగా మోసం చేస్తున్నారన్నారు. పలువురు అప్పుల పాలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టడంతో పాటు తీవ్ర నిర్ణయాలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

**బెట్టింగ్ నేరం.. జైలుశిక్ష తప్పదు..**

తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం బెట్టింగ్ నిర్వహించడం, పాల్గొనడం నేరమని అధికారులు స్పష్టం చేశారు. నేరం రుజువైతే 3 నెలల నుంచి ఏడాది వరకు జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. క్రికెట్ మ్యాచ్‌లను వినోదంగా మాత్రమే చూడాలని, డబ్బు కోసం బెట్టింగ్ యాప్స్ డౌన్‌లోడ్ చేయకూడదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ లింకులు, ప్రకటనలను నమ్మకూడదని, తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, యూపీఐ వివరాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. సులభంగా డబ్బు వస్తుందనే ఆశకు లోనుకాకూడదని, కుటుంబాల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. బెట్టింగుల వలన మీరు సంపాదించినది పోతుంది.. కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. బెట్టింగులతో బుక్కీలు లాభపడతారని.. మీరు నష్టపోతారని తెలిపారు. బెట్టింగ్ లకు పాల్పడితే చివరి ఫలితం అప్పులు, ఆత్మహత్యలేనని అధికారులు హెచ్చరించారు.

**సమాచారం ఇవ్వండి..**

బెట్టింగ్ నిర్వహిస్తున్న వారి సమాచారం తెలిసిన వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని డీఎస్పీ రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబులు తెలిపారు. బ్యాట్ చేతిలో ఉంటే హీరో అవుతారని..బెట్టింగ్ యాప్ ఫోన్‌లో ఉంటే జీరో అవుతారని.., బెట్టింగ్ గెలిపించదు.. జీవితాన్ని ఓడిస్తుందనే.. క్యాప్షన్ ద్వారా పోలీసులు క్రికెట్ బెట్టింగులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



# మహిళ శరీరం కేవలం లైంగిక ఆకర్షణ కోసమే కాదు..

## బాడీ షేమింగ్‌పై స్వరా భాస్కర్

మహిళలపై బాడీ షేమింగ్ చేసేవాళ్లపై బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ స్వరా భాస్కర్ మరోసారి ఫైర్ అయింది. ఆడ వాళ్ల శరీరం కేవలం గ్లామర్ ప్రదర్శించడానికి, లైంగిక ఆకర్షణ కోసమే కాదని.. ఒకరికి ప్రాణం పోయడం వంటి గొప్ప పని కూడా చేస్తుందని, అలాంటప్పుడు శరీరంలో మార్పులు రావడం చాలా సహజమని, వాటిని స్వీకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తను వెడ్స్ మను', 'రాంజనా' వంటి సినిమాలతో బాలీవుడ్‌లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న స్వరా భాస్కర్..2023లో ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ తర్వాత ఆమె శరీరంలో భారీ మార్పులు వచ్చాయి. బరువు పెరిగి కాస్త లావుగా మారింది. అయితే తాజాగా తన పాత ఫోటోని, ప్రస్తుత ఫోటోని కలిపి ఒక కొలాజ్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ ఫోటో కాస్త వైరల్ కావడం.. కొంతమంది నెటిజన్స్ 'గుర్తుపట్టలేనంత మారిపోయింది'. 'ఇక ఆమె కెరీర్ క్లోజ్' అంటూ బాడీ షేమింగ్ చేస్తూ కామెంట్స్ పెట్టారు. వీటిపై ఆమె తీవ్రంగా స్పందించారు. 'ఒక ప్రాణానికి జన్మనివ్వడం సాధారణ విషయం కాదు. ఆ సమయంలో బాడీ ఎన్నో మార్పులకు గురవడం చాలా సహజం. బిడ్డ పుట్టిన తర్వాత కూడా మళ్లీ ఇంతకుముందులానే ఉండాలని ఒత్తిడి చేయడం సరికాదు. ఆడాళ్లు షోకేస్‌లో పెట్టే అందాల బొమ్మలు అసలే కాదు' అంటూ ఇన్‌స్టాలో ఓ సుధీర్ఘమైన పోస్ట్ పెట్టింది. 'నేను ఈ మాటను పదే పదే ప్రాలనుకుంటున్నాను. మహిళల శరీరం కేవలం ఆకర్షణ కోసం లేదా గ్లామర్ కోసం కాదు. నాకు బిడ్డ పుట్టిన తర్వాత మునపటిలా మారాలని అనుకోలేదు. ఎందుకంటే మీకు బిడ్డ పుట్టాక, మళ్లీ వెనక్కి వెళ్లే అవకాశం ఉండదు. మీరు జీవితాంతం తల్లిదండ్రులుగానే ఉంటారు. జీవితం పూర్తిగా మారిపోతుంది. అందులో ఎలాంటి తప్పు లేదు. నిజమే.. మనం మన పాత జీవితాన్ని, చిన్ననాటి స్వేచ్ఛా లైఫ్‌ను, సన్నగా ఉన్న శరీరాన్ని మిస్ అవుతాం. కానీ మన చిన్ననాటిలాగే ఉండాలని అనుకోవడం, మన శరీరాన్ని గతంలోకి బలవంతంగా నెట్టడం ఒకరకమైన క్రూరత్వం. మన శరీరం మరో మనిషికి జన్మనిచ్చింది. కనుక శరీరం మారడం సహజం. కెమెరాల కోసం, అపరిచితుల కోసం ఆకర్షణీయంగా కనిపించాలని ఒత్తిడి పెంచుకోవడం తెలివి తక్కువ పని. డెలీవరీ తర్వాత బరువు పెరిగిన మహిళలపై బాడీ షేమింగ్ చేయడం నీచమైన పని. ఒక మహిళ.. తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా బతకాలి. అలా అని నేను ఫిట్‌నెస్‌గా ఉండకూడదని చెప్పడం లేదు. మన శరీరాలను గౌరవించుకోవడానికి, మనకు సరిపోని పరిమితుల్లో మనల్ని మనం బంధించుకోవడం ఆపడానికి చేసే వాదన. జీవితం అనేది మన అంతరాత్మలోకి, ముందుకు సాగే ఒక ప్రయాణం. మన శరీరాలకు కూడా ఆ గౌరవాన్ని ఇవ్వడంలో తప్పులేదు' అని స్వరా భాస్కర్ ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. ఇక నటీనటులు గ్లామర్‌గా ఉండాలని చెప్పేవాళ్లకు కూడా ఆమె కౌంటర్ ఇచ్చింది.'నటన అనేది టాలెంట్‌కు సంబంధించిన విషయం. దానికి మనిషి బరువుతోనో, గ్లామర్‌తోనో అస్సలు సంబంధం లేదు' అని స్వరా భాస్కర్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారగా.. పలువురు ఆమెకు మద్దతు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.



# ఆ తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది

''చెన్నైలోని మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది'' అన్నారు శ్రుతీహాసన్. ఆమె తండ్రి , ప్రముఖ నటుడు కమల్‌హాసన్ నాస్తికుడు అనే విషయం తెలిసిందే. శ్రుతీహాసన్ మాత్రం 'నేను నాస్తికురాలిని కాదు... నాలో దైవ భక్తి, విశ్వాసం ఉన్నాయి' అని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ''నా జీవితంలో వారాహి అమ్మవారి ప్రభావం చాలా ఉంది. మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది. మనం ఓ గుడికి వెళ్లాలని నిర్ణయించుకుని వెళతాం. అయితే దైవాలు కూడా మనల్ని ఎంచుకుంటారు. వారాహి అమ్మవారి గర్భగుడిలోకి వెళ్లగానే భక్తి పారవశ్యాన్ని పొందాను. అంతేకాదు.. ఏదో తెలియని శక్తి నన్ను ఆవహిస్తోందనిపించింది. ఆ గుడిలో వీఐపీ క్యూలు లేవు... ఆడంబరాలు లేవు. కేవలం శక్తివంతమైన వారాహి అమ్మవారు మాత్రమే ఉన్నారు. అదే విధంగా అస్సాంలోని శక్తిపీఠం కామాఖ్య దేవాలయాన్ని కూడా సందర్శిస్తుంటాను. నాలోని మానసిక ప్రశాంతతకు, ఆత్మవిశ్వాసానికి ఆధ్యాత్మిక చింతనే కారణం అనుకోవచ్చు'' అని శ్రుతీహాసన్ తెలిపారు. ప్రస్తుతం ఆమె తమిళంలో విజయ్ సేతుపతి సరసన 'ట్రైన్' మూవీలో నటిస్తున్నారు.



# హీరోతో డేటింగ్.. టాక్సిక్ బ్యూటీపై రూమర్స్..!

సినీ ఇండస్ట్రీలో ఎప్పుడు ఏదో ఒక రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా డేటింగ్, రిలేషన్ అనే పదాలు ఎక్కువగా వింటుంటాం. తాజాగా బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియాకు సంబంధించిన ఓ న్యూస్ బాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తోంది. ఆమెకు తన బాయ్‌ఫ్రెండ్ వీర్ పహారియాతో బ్రేకప్ అయిందని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇప్పటి వరకు తారా కానీ.. పహారియా కానీ స్పందించలేదు. విడిపోవడంపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే అంతలోనే తారా సుతారియాపై మరో రూమర్ వైరల్‌గా మారింది. బాలీవుడ్ హీరో ఆదిత్యరాయ్ కపూర్‌తో ఆమె డేటింగ్‌లో ఉందంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. తాజా నివేదిక ప్రకారం అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం వీరిద్దరు ఒకరినొకరు కలుసుకుంటున్నారని బాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. దీంతో ఇప్పుడిది బీటౌన్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా..గతంలో ఆదిత్యరాయ్ కపూర్.. హీరోయిన్ అనన్య పాండేతో రిలేషన్ కొనసాగించారు. అయితే గతేడాది చివర్లో ముంబైలో జరిగిన కచేరీ వివాదం తర్వాత తారా, వీర్ పహారియాపై బ్రేకర్ రూమర్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే ఈ బాలీవుడ్ భామ యశ్ చిత్రం టాక్సిక్‌లో కనిపించనుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034